సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 22 । జూన్ । 2024



యోగా.. మనసు హాయిగా

యోగా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని స్కూళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వివిధ స్వచ్ఛంద సంస్థల్లో యోగాసనాలు వేశారు. 8లో ▸



జీవన ఎరువులతో అధిక దిగుబడి

పంటల అధిక దిగుబడుల కోసం, పెట్టుబడులు తగ్గాలన్నా, దుష్ఫలితాలు లేకుండా ఉండాలన్నా సాగులో జీవన ఎరువులు వాడకం మంచిది. 8లో ▸



స్కేటింగ్‌లో రికార్డులు

తణుకులో ఏడేళ్ల చిన్నారి ధన్విక చేసిన స్కేటింగ్ ప్రదర్శన ప్రపంచ రికార్డు సాధించింది. ధన్విక 18 కిలోమీటర్లు కళ్లకు గంతలతో స్కేటింగ్ చేసింది. 8లో ▸

న్యూస్‌రీల్

గోదారమ్మకు నీరాజనం



పెనుగొండ: జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా సిద్ధాంతం కేదారీఘాట్‌లో వశిష్టా గోదావరికి హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పంచ హారతులు ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం కలగ భద్రుడు స్వామి బ్రహ్మత్వంలో యర్రంశెట్టి శ్రీనివాస్, జయలక్ష్మి దంపతులు హారతులు ఇచ్చారు. నదీమ తల్లులను ఆరాధించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమని కలగ భద్రుడు అన్నారు. హిందూ ధర్మపరిరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

24న 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' నిర్వహణ

ఏలూరు(మెట్రో): ఏలూరు కలెక్టరేట్, జిల్లాలోని డివిజినల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో ఈనెల 24న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్టు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్‌గా శ్రీనివాస్



పెనుమంట్ర: మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్‌గా డాక్టర్ టి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఏడీఆర్ డి.శ్రీనివాస్ రాజమండ్రిలోని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్‌గా బదిలీ కావడంతో టి.శ్రీనివాస్‌ను పదోన్నతిపై ఏడీఆర్‌గా నియమించారు. టి.శ్రీనివాస్ చాలాకాలం నుంచి ఈ పరిశోధనా స్థానంలో వరి సైంటిస్టుగా పనిచేస్తున్నారు.

నేడు హైకోర్టు జడ్జి రాక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి, పశ్చిమగోదావరి జిల్లా పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్, మాజీ హైకోర్టు జడ్జి ఏవీ శేషసాయి శనివారం జిల్లాకు రానున్నారు. ఉదయం 9.30 గంటలకు ఏలూరుకు చేరుకున్న వారు కొద్దిసేపు స్థానిక రెవెన్యూ అతిథి గృహంలో బస చేస్తారు. అనంతరం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జరిగే న్యాయ సదస్సులో పాల్గొంటారు.

విధుల్లోకి తీసుకోవాలని వినతి

ఏలూరు(మెట్రో): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని ఏపీఎన్‌జీవోస్ నాయకులు కోరారు. శుక్రవారం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్‌ను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కొందరు ఉద్యోగులు వివిధ కారణాలతో సస్పెన్షన్‌కి గురయ్యారన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో వారందరినీ విధుల్లో తీసుకోవాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ వెంటనే ఉద్యోగులకు పోస్టింగ్స్ ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు. కలెక్టర్‌కి ఎన్జీవోస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

డీసీసీబీ సీఈఓగా సత్యనారాయణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) సీఈఓగా జీవీ సత్యనారాయణ నియమితులయ్యారు. ప్రస్తుతం ఆ స్థానంలో పనిచేస్తున్న శ్రీదేవి పదవీ కాలం ముగియడంతో సత్యనారాయణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సత్యనారాయణ నియామకంపై జిల్లాలోని సొసైటీల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

కృత్రిమ అవయవాల పంపిణీ



వృద్ధురాలికి కృత్రిమ కాలు అమర్చిన దృశ్యం

ఏలూరు (ఆర్ఆర్ పేట): స్థానిక దొండపాడులోని ఉమా ఎడ్యుకేషనల్–టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు సంస్థ కో–ఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ, ఫిజియోథెరపీ, ఆడియోలజీ, స్పీచ్ థెరపీ, యూడీఐడీ, నిరామయ హెల్త్ కార్డులు వంటి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో బురిడీ

- వైద్య కళాశాలలో ఉద్యోగాలంటూ మోసం
- ఉద్యోగార్థుల నుంచి సొమ్ముల వసూళ్లు
- సైబర్ నేరగాళ్లా.. మధ్య దళారులా?
- బ్యాంకు ఖాతాలకు సొమ్ములు జమచేయాలంటూ డిమాండ్
- లబోదిబోమంటోన్న పేద వర్గాల యువత

ఏలూరు టౌన్: రాష్ట్రంలో కొత్త సర్కారు కొలువుదీరి పట్టుమని పక్షం రోజులు కాకముందే మోసగాళ్లు పేట్రేగిపోతున్నారు. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఏలూరు జీజీహెచ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులకు వల వేస్తున్నారు. పోస్టులకు దరఖాస్తు చేసిన అభ్యర్థులకు ఫోన్‌లు చేసి సొమ్ములు చెల్లిస్తే పోస్టు మీదే అంటూ నమ్మిస్తున్న ముఠా తెరపైకి వచ్చింది. ఇలా వందలాది మంది నిరుద్యోగులకు మాయమాటలు చెబుతూ, నకిలీ నియామక పత్రాలను సైతం పంపుతూ మోసాలకు పాల్పడుతున్నారు. దీనిపై దరఖాస్తుదారులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా తమకేమీ సంబంధం లేదని అంటున్నారు. మోసాలకు పాల్పడే వ్యక్తులు దళారులా? కార్యాలయ సిబ్బందా? సైబర్ నేరగాళ్లా? అనే విషయాలపై విచారణ చేపట్టాలని బాధితులు కోరుతున్నారు.

నిరుద్యోగులే లక్ష్యంగా..

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల, ఏలూరు జీజీహెచ్‌లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పోస్టుల భర్తీకి 2023 నవంబర్‌లో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. మెడికల్ కాలేజీలో 6 కేటగిరీల్లో 17 పోస్టులు, జీజీహెచ్ పరిధిలో 17 కేటగిరీల్లో 81 పోస్టులు, ఏలూరు నర్సింగ్ కాలేజీలో 5 కేటగిరీల్లో 10 పోస్టులను భర్తీ చేయనున్నారు. స్టోర్ కీపర్, పీఈటీ, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, ఎలక్ట్రికల్ హెల్పర్, ఆఫీస్ సబార్డినేట్, మార్చురీ అటెండర్, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ల్యాబ్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, మెడికల్ కాలేజీ హాస్టల్ వార్డెన్ పోస్టులు ఇలా పలు కేటగిరీల్లో పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లావ్యాప్తంగా సుమారు 10 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. ఈ పోస్టులకు సంబంధించి దరఖాస్తుల పరిశీలన పూర్తికాగా మెరిట్ లిస్ట్ జారీ చేయలేదు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోస్టుల భర్తీ జరగలేదు. ఈ నేపథ్యంలో మోసగాళ్లు అభ్యర్థులకు గాలం వేసి తొలి దఫాలో రూ.25 వేలు, అనంతరం మరో రూ.25 డిమాండ్ చేస్తున్న ఘటనలు వెలుగుచూశాయి. తాము మోసపోయామని గుర్తించిన అభ్యర్థులు అధికారులను సంప్రదించగా పోలీస్ కేసు పెట్టాలంటూ చెప్పి సర్దిచెప్పటం తప్ప విచారణ చేయకపోవటం అనుమానాలకు తావిస్తోంది.

వివరాలు బయటకు ఎలా వెళ్లాయి?

జిల్లా అధికారులు నోటిఫికేషన్ జారీ చేసి, దరఖాస్తులు స్వీకరించి, వాటి వివరాలను కార్యాలయంలోని కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తారు. అయితే మెరిట్ లిస్ట్ కూడా విడుదల కాకుండా దరఖాస్తుదారుల పూర్తి వివరాలు బయటకు ఎలా వెళ్లాయనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్టోర్ కీపర్ పోస్టులకు సంబంధించి నేరగాళ్లు ఏకంగా 350 మందితో ఒక మెరిట్ లిస్టును సైతం తయారు చేయటం విశేషం. వీరిలో 200 మందికి పైగా అభ్యర్థులను మోసం చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. హాస్టల్ వార్డెన్ పోస్టులకు మరో 340 మందితో మెరిట్ లిస్ట్ తయారు చేశారని చెబుతున్నారు.

వైద్యశాఖ అధికారినంటూ..


ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని లంబాడీపేటకు చెందిన యువకుడికి ఓ వ్యక్తి ఫోన్ చేసి దరఖాస్తులోని పూర్తి వివరాలు చెబుతూ ఉద్యోగం కావాలా? వద్దా? అంటూ అడిగాడు. తాను విశాఖలోని హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో అధికారిని అంటూ పరిచయం చేసుకున్నాడు. మీరు ఏలూరు మెడికల్ కాలేజీలో పోస్టు కోసం దరఖాస్తు చేశారు.. ఉద్యోగం కావాలంటే డబ్బులు కట్టాలని చెప్పి సొమ్ములు కట్టించుకున్నాడు. ఇలా నిరుద్యోగులకు కాల్ చేసి యాక్సిస్, ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాల వివరాలను ఇస్తూ వాటికి డబ్బులు పంపాలని డిమాండ్ చేస్తున్నారు. తమకు సెల్ 8260105367 (ఏడుకొండలు) నుంచి ఫోన్‌లు వస్తున్నాయని అభ్యర్థులు అంటున్నారు.



ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల

మెయిల్‌లో నకిలీ జాయినింగ్ లెటర్

ఏలూరు జిల్లా నిడమర్రు ప్రాంతానికి చెందిన మోదుగుమూడి విజయ అనే యువతి వైద్య కళాశాలలో స్టోర్ కీపర్ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకుంది. తాను ఏలూరు మెడికల్ కాలేజీలో ఏసీ విభాగంలో పనిచేస్తున్న ఏడుకొండలు.. అంటూ ఓ వ్యక్తి ఆమెకు ఫోన్ చేశాడు. మీ పేరు మెరిట్ లిస్టులో లేదు.. మీరు డబ్బులు కడితే మెరిట్ లిస్టులో పేరు చేర్చి, ఉద్యోగం వచ్చేలా చేసానంటూ నమ్మించాడు. ముందుగా రూ.25 వేలు కట్టాలన్నాడు. దీంతో ఆమె అతడు చెప్పిన ఐసీఐసీఐ బ్యాంకు ఖాతాకు సొమ్ములు జమచేసింది. అనంతరం ఆమెకు మెయిల్ ద్వారా నియామక పత్రం వచ్చింది. జిల్లా హెల్త్ డిపార్ట్‌మెంట్ పేరుతో జాయినింగ్ లెటర్ ఇస్తూ.. దానిలో ఏలూరు జీజీహెచ్ మెడికల్ సూపరింటెండెంట్ సంతకం, స్టాంప్ సైతం ఉండడం గమనార్హం. అనంతరం మరో రూ.25 వేలు పంపాలని లేకుంటే మీకు ఉద్యోగం రాదంటూ అతడు ఫోన్ చేసి చెప్పడంతో ఆమె శుక్రవారం ఏలూరు జీజీహెచ్‌కు వచ్చింది. అధికారులను ఆరా తీయగా తమకేమీ సంబంధం లేదని, డబ్బులు కడితే మేం చేసేదేమీ లేదని, పోలీసులకు ఫిర్యాదు చేసుకోమంటూ సీరియస్‌గా చెప్పి పంపారని బాధితురాలు విజయ వాపోతోంది.



District Health Department , El
Government of Andhra Pradesh

To,
(MODUGUMUDI VIJAYA)
Sr. District Vice President
Health Resources Division

From District Collector Office
Eluru, Andhra Pradesh
Email:-eluru.ap.gov.in@gmail.com

SUB : JOINING LETTER

Post : STORE KEEPER

Dear MODUGUMUDI VIJAYA

I have honor to inform you have joining the District Collector O[illegible] Eluru from joining date 12 July, 2024 As a post "Store Keeper" [illegible] respect to your appointment letter 12 July, 2024
Ref. no - 01 , Id - STK/0000102

I kindly request you to accept joining letter

ఓ అభ్యర్థికి మెయిల్ చేసిన నకిలీ నియామక పత్రం

సమగ్ర విచారణ చేయాలి



మా మేనల్లుడు, బావమరిదికి ఏడుకొండలు అనే వ్యక్తి నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి. మెడికల్ డిపార్ట్‌మెంట్ అధికారి అంటూ పరిచయం చేసుకుని ఉద్యోగం కావాలంటే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనిపై వైద్యశాఖ ఉన్నతాధికారులను సంప్రదించగా సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. చాలామంది గ్రామీణ పేద నిరుద్యోగ యువత నేరగాళ్ల మోసాలకు బలయ్యారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయాలి.

– గుగ్గులోతు కృష్ణ, ఏపీటీఎఫ్ 1938, రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్

పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటా..



అత్తిలిలో వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, ప్రజాసమస్యలపై పోరాటాలకు సిద్ధంగా ఉంటామని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం అత్తిలిలోని ఆయన నివాసంలో పార్టీ శ్రేణులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టారని, ప్రజాతీర్పును గౌరవిస్తున్నామన్నారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు అమలు చేయాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కుల, మత, పార్టీలను చూడకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. కొన్ని ప్రాంతాలలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కూటమి నాయకులు ఇబ్బంది పెడుతున్నట్టు తన దృష్టికి వచ్చిందని, ఇది సరికాదన్నారు. ఎన్నికల ఫలితాలపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయని, తాము వేసిన ఓట్లు ఏమయ్యాయని వారు అంటున్నారన్నారు. దేశంలో ఈవీఎంలలో తేడా జరిగిందని పలువురు గగ్గోలు పెడుతున్నారని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, కసిరెడ్డి బాలాజీ, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలుచేయాలి

ఇరగవరం: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఇరగవరంలోని పాలేశ్వరస్వామి ఆలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఎవరైనా ఇబ్బంది పెడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేల్పూరులో వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని, దీనిపై పెద్ద ఎత్తున ఆందోళనకు సిద్ధం కాగా పోలీసులు నిందితులపై కేసు నమోదు చేయడంతో తాత్కాలికంగా ఆందోళనను విరమించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయని, ధరలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇరగవరం సర్పంచ్ కంకిపాటి శ్రీనివాస్, ఎంపీటీసీ పాల పాలేశ్వరరావు, మంగెన రామానాయుడు, వీరవల్లి యుగంధర్, బీసీ సెల్ అధ్యక్షుడు కుడుపూడి సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు మెట్ల కిరణ్మయి, మాజీ సొసైటీ అధ్యక్షుడు చవ్వాకుల శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు మంగెన సూర్య, విద్యా కమిటీ చైర్మన్ జగనొట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్లలో రాయితీపై కూరగాయలు

చర్యలకు కలెక్టర్ ఆదేశం

భీమవరం (ప్రకాశం చౌక్): రైతు బజార్ల ద్వారా కూరగాయలను సబ్సిడీ ధరలకు అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో కూరగాయల ధరలు పెరుగుతున్న దృష్ట్యా అధికారులతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. నేరుగా కూరగాయలు కొనుగోలు చేసి రైతు బజార్ల ద్వారా సబ్సిడీ ధరల్లో విక్రయించేలా ఆలోచన చేస్తున్నామన్నారు. మదనపల్లె నుంచి టమాటాను కొనుగోలు చేయాలని సూచించారు. భీమవరం రైతు బజార్‌లో ఆర్వో ప్లాంటును రూ.40 వేలతో వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అలాగే నాలుగు టాయిలెట్లు మరమ్మతులకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. మాంసం దుకాణాల వద్ద ధరల పట్టికను ప్రదర్శించాలని, వినియోగదారులకు ఇబ్బంది లేనివిధంగా పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని ఎస్టేట్ అధికారికి సూచించారు. సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామ్ ప్రసాద్, డీఎస్ఓ ఎన్.సరోజ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఆర్.దేవానంద్ కుమార్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి కె.సునీల్‌కుమార్, భీమవరం రైతు బజార్ ఎస్టేట్ అధికారి ఆర్.కల్యాణ్, ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కేపీఎస్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



భీమవరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఎస్టీ కాలనీలో మౌలిక వసతుల కల్పన

వీరవాసరం ఎస్టీ కాలనీవాసుల మౌలిక వసతుల మెరుగుదలకు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో వీరవాసరం ఎస్టీ కాలనీ సమస్యలపై అధికారులతో చర్చించారు. కాలనీలో 82 కుటుంబాలకు చెందిన 251 మంది నివసిస్తున్నారని, వీరికి ఇళ్లు, ఆధార్‌కార్డులు, రైస్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, విద్యుత్ కనెక్షన్, మంచి నీటి కుళాయిలు, ఎన్ఆర్‌జీఎస్ జాబ్ కార్డ్స్, టాయిలెట్స్ తదితరాలపై ఆరా తీస్తూ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి పరిశీలించాలన్నారు. బీమా సదుపాయంతో పాటు స్కూల్ డ్రాప్ అవుట్స్‌పై పర్యవేక్షించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేయాలన్నారు. రెండు నెలల్లో పూర్తిస్థాయిలో వసతుల కల్పనకు కృషిచేయాలని ఆదేశించారు. వీరవాసరం తహసీల్దార్ జె.సుశీలదేవి, ఎంపీడీఓ పార్థసారథి, హౌసింగ్ ఏఈ కేఎస్ఆర్‌సీహెచ్ మూర్తి, పంచాయతీరాజ్ ఏఈ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి సంరక్షణపై ట్రిబ్యునల్‌లో కేసు

కొయ్యలగూడెం: వృద్ధాప్యంలో ఉన్న తల్లిని పట్టించుకోకపోవడంతో ఆమె పిల్లలంతా ట్రిబ్యునల్ ఎదుట హాజరుకావాలని జంగారెడ్డిగూడెం డివిజనల్ మెజిస్ట్రేట్ శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి.. కొయ్యలగూడెంకు చెందిన 85 ఏళ్ల వెంకటలక్ష్మికి ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమారుడు ఉద్యోగిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేశారు. రెండో కుమారుడు నిరుద్యోగి, మూడో కుమారుడు రైతుగా జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమార్తె, అల్లుడు ప్రభుత్వ ఉద్యోగులు కాగా వీరిద్దరూ పదవీ విరమణ పొందారు. మరో కుమార్తె భర్త ప్రభుత్వ ఉద్యోగి. అయినా వృద్ధాప్యంలో ఉన్న తల్లి వెంకటలక్ష్మిని చూసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీనిపై ఒక కుమారుడు డివిజనల్ ట్రిబ్యునల్‌ని ఆశ్రయించారు. కనిపెంచిన తల్లి పరిచర్యలు చేయటానికి కుమార్తెలు సైతం ముందుకు రావడం లేదని, ఒకే ఊరిలో ఉన్నా ఆమె సంరక్షణ పట్టించుకోవడం లేదని ట్రిబ్యునల్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేయగా వృద్ధురాలు వెంకటలక్ష్మి పిల్లలంతా శనివారం జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయంలో జరిగే ట్రిబ్యునల్ కోర్టుకు హాజరుకావాలని మేజిస్ట్రేట్ కె.అద్దయ్య ఆదేశించారు.

దుగ్గిరాల.. గుండెలవిసేలా..

- రామాపురం బీచ్‌లో నలుగురు గల్లంతు
- ఇద్దరి మృతదేహాలు లభ్యం
- మరో ఇద్దరి కోసం గాలింపు
- పెదవేగి మండలం దుగ్గిరాలకు చెందిన యువకులుగా గుర్తింపు
- శోకసంద్రంలో యువకుల కుటుంబాలు



జాలా కిషోర్ (ఫైల్)



గొటికల తేజ (ఫైల్)



నితిన్ (ఫైల్)



అమ్మన్నరాజ్ (ఫైల్)

పెదవేగి: సరదాగా సేద తీరేందుకు బీచ్‌కు వెళ్లిన నలుగురు యువకులు సముద్రంలో గల్లంతు కావడం తీరని విషాదాన్ని నింపింది. వీరిలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ఇద్దరి ఆచూకీ తెలియరాలేదు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం దుగ్గిరాలకు చెందిన 12 మంది యువకులు శుక్రవారం బాపట్ల జిల్లా వేటపాలెం మండలం రామాపురం బీచ్‌కు వెళ్లారు. వీరంతా కేరింతలు కొడుతూ సముద్ర స్నానానికి పరుగులు తీశారు. సముద్రంలో స్నానాలు చేస్తుండగా నలుగురు యువకులు గల్లంతయ్యారు. తోటి యువకులు వీరి కోసం వెతికినా జాడ తెలియలేదు. దీంతో స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రెస్క్యూ సిబ్బంది సముద్రంలో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికి దుగ్గిరాలకు చెందిన గొటికల తేజ (21), జాలా కిషోర్ (28)ల మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. కోరు అమ్మన్నరాజు, చట్టిమాల నితిన్‌ల ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

మేరీమాత దర్శనం చేసుకుని..

దుగ్గిరాలకు చెందిన డేవిడ్, నిర్మల కుమారుడు గొటికల తేజ చదువుకుంటూ ఖాళీ సమయంలో కూలీ పనులు చేస్తుంటాడు. ఉదయం ఇంటి నుంచి విజయవాడలోని గుణదల మేరీ మాత దర్శనం చేసుకుని అటు నుంచి రామాపురం బీచ్‌కు వెళ్లాడని, తమ కుమారుడు సముద్రంలో మునిగి చనిపోయినట్టు సాయంత్రం ఫోన్ వచ్చిందని కుటుంబ సభ్యులు బోరుమంటున్నారు.

సాయంత్రం వచ్చేస్తానని..

గ్రామంలోని బోయిజ్, స్వరాజ్యలక్ష్మి చిన్న కుమారుడు జాల కిషోర్. ఉదయం స్నేహితులతో కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లాడని, సాయంత్రం వచ్చేస్తానని చెప్పి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడని కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. కిషోర్ కూలీ పనులు చేస్తుంటాడు.

కూలి పనులు చేస్తూ జీవనం

గ్రామానికి చెందిన కోరు అమ్మన్నరాజు తండ్రి బాలస్వామి మృతి చెందగా తల్లి పావని సంరక్షణలో చదువుకుంటూ ఖాళీ సమయంలో కూలీ పనులు చేస్తున్నాడు. గుణదలలోని మేరీ మాత దర్శనానికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడని సాయంత్రం ఎవరో ఫోన్ చేసి రామాపురం బీచ్‌లో అమ్మన్నరాజు గల్లంతయ్యాడని చెప్పారని తల్లి రోదిస్తోంది.

హుటాహుటిన రామాపురానికి..

గ్రామానికి చెందిన ఆశీర్వాదం, జయమేరీల చిన్న కుమారుడు చట్టిమాల నితిన్. సరదాగా స్నేహితులతో కలిసి బయటకు వెళ్లి వస్తానని సంతోషంగా ఇంటి నుంచి బయలుదేరాడని, సాయంత్రం ఎవరో ఫోన్ చేసి నితిన్ సముద్రంలో గల్లంతయ్యాడని చెప్పడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన రామాపురం బయలుదేరి వెళ్లారు.

మాజీ ఎమ్మెల్యే కొఠారు దిగ్భ్రాంతి

దెందులూరు: దుగ్గిరాలకి చెందిన యువకులు బీచ్‌లో ప్రమాదవశాత్తు మృతి చెందడంపై దెందులూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొఠారు అబ్బయ్యచౌదరి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబసభ్యులు ధైర్యం ఉండాలన్నారు. ఆయా కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

యోగాతో ఒత్తిళ్లు దూరం



యోగా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జడ్జి పురుషోత్తంకుమార్, న్యాయమూర్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): మానసిక ఒత్తిళ్లు అధిగమించడానికి, ఆరోగ్య పరిరక్షణకు యోగా సరైన మార్గమని, ప్రతిఒక్కరూ రోజూ గంట సమయం యోగాకు కేటాయించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ సూచించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఏలూరులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ అందరూ యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, పోక్సో జడ్జి ఎస్.ఉమా సునంద, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బుల్లి కృష్ణ, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేత్రపర్వంగా చక్రస్నానం



అత్తిలి మండలం ఈడూరు శ్రీవరాల వెంకటేశ్వరస్వామికి చక్రస్నానం

అత్తిలి : ఈడూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీవరాల వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామివారి చక్రస్నానం కనుల పండువగా జరిగింది. ఉదయం పెరికెల మురళి, చక్రధరణి, కాపు పైడిరాజు, నాగలక్ష్మి దంపతులచే శ్రీస్వామివారి సుప్రభాత సేవ, మేలుకొలుపు, తోమాల సేవ జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఊరేగింపుగా కొలను వద్దకు వెళ్లి శ్రీవారి చక్రస్నాన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను శాస్త్రోక్తంగా జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

జీవో నెం.3ను పటిష్టంగా అమలు చేయాలి

కుక్కునూరు: షెడ్యూల్ ప్రాంతంలో జీవో నెంబర్ 3ను ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ, అరకు ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జీఓ నెంబర్ 3 ను పటిష్టంగా అమలు చేస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. జీఓ నెంబర్ 3ను పటిష్టంగా అమలు చేయాలన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఖరీఫ్ వ్యవసాయ పెట్టుబడి కోసం అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నికల హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రైతులు, కౌలు రైతులకు పంట పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ కోరారు. శుక్రవారం ఏలూరు అన్నే భవనంలో మాట్లాడుతూ వ్యవసాయ పథకాలు వాస్తవ సాగుదారులకు అందడం లేదన్నారు. ఫలితంగా పేద రైతులు, కౌలు రైతులు పంట సాగుకు అధిక పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు కౌలు రైతులకు అందడం లేదన్నారు. గత ప్రభుత్వం అందించిన రైతు భరోసా పెట్టుబడి సాయం కౌలు రైతులకు అందలేదన్నారు.

న్యాయం చేయాలంటూ ఉద్యోగుల ఆందోళన



సీపీఎఫ్ కంపెనీ వద్ద ఉద్యోగుల ఆందోళన

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు న్యాయం జరిగే వరకూ ఆందోళన కొనసాగిస్తామని కంపెనీ ఉద్యోగులు ప్రకటించారు. తమకు న్యాయం చేయాలని, నియామక సమయంలో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ శుక్రవారం సిపిఎఫ్ ఉద్యోగులు రాజమండ్రిలోని సిపిఎఫ్ కంపెనీ గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తాము రెండు వారాలుగా ఆందోళనలు, నిరాహార దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని, ప్రభుత్వ జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

యోగా.. మనసు హాయిగా

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని స్కూళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, వివిధ స్వచ్ఛంద సంస్థల్లో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా గురువులు యోగా ప్రాధాన్యతను వివరించారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని, ప్రతి రోజూ కొంత సమయం యోగాకు కేటాయిస్తే రోగాలు, ఆస్పత్రులకు దూరంగా ఆరోగ్యకరమైన జీవనం గడపవచ్చని బోధించారు. యోగాతో ఒత్తిడి లేని జీవితం సాధ్యమవుతుందని చెప్పారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ, అధికారుల నుంచి రైతు కూలీల వరకూ అందరూ ఆసనాలు వేసి వాటి విలువను తెలుసుకున్నారు.

–సాక్షి నెట్‌వర్క్



భీమవరం: పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్లో రోప్‌పై యోగాసనాలు



తాడేపల్లిగూడెం (టీపీసీ) : తాడేపల్లిగూడెం పతంజలి యోగాలయంలో



భీమవరం: పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్ఎం హైస్కూల్లో యోగాసనాలు



తాడేపల్లిగూడెం (టీపీసీ) : తాడేపల్లిగూడెం మునిసిపల్ కార్యాలయంలో అధికారుల యోగాసనాలు



ఆర్ఆర్‌పేట (ఏలూరు) : సెయింట్ థెరిస్సా కళాశాలలో విద్యార్థినుల యోగాసనాలు



పెనుగొండ : భాష్యం స్కూలులో ..



అత్తిలి : మండలంలోని బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో..



తాడేపల్లిగూడెం (టీపీసీ) : తాడేపల్లిగూడెంలో యోగాచార్యులు ఇంజుమూరి విన్యాసం



చింతలపూడి: యండపల్లిలో రైతులు, రైతు కూలీల యోగాసనాలు

స్కేటింగ్‌లో ధన్విక రికార్డులు



తణుకులో జాతీయ రహదారిపై కళ్లకు గంతలు కట్టుకుని స్కేటింగ్ చేస్తున్న చిన్నారి ధన్విక

తణుకు అర్బన్ : తణుకులో ఏడేళ్ల చిన్నారి చేసిన స్కేటింగ్ ప్రదర్శనతప్రపంచ రికార్డు నెలకొల్పింది. స్కేటింగ్ రేంజర్స్ అకాడమీలో శిక్షణ పొందిన పెంటపాడు మండలం అలంపురం గ్రామానికి చెందిన ఎం.ధన్విక మల్టీ టాస్క్ రోడ్ స్కేటింగ్ పేరుతో తణుకు జాతీయ రహదారి డీమార్ట్ నుంచి సిద్ధాంతం వరకు 18 కిలోమీటర్లు కళ్లకు గంతలు కట్టుకుని స్కేటింగ్ చేస్తూ తలపై, చేతుల్లోను నిప్పుతో నింపిన కుండలు పెట్టుకుని, కర్ర సాము, ట్యూబ్‌లైట్‌లు పగులగొడుతూ సాగిన స్కేటింగ్ ప్రదర్శన వండర్ బుక్స్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఆయా సంస్థల ప్రతినిధులతో పాటు మాజీ ఏఎంసీ చైర్మన్ బసవ రామకృష్ణ, టీడీపీ అధ్యక్షుడు కలగర వెంకటకృష్ణ, విజయ మెస్ అధినేత కడియం వెంకటేశ్వరరావు చేతులమీదుగా రికార్డులకు సంబంధించిన ధ్రువ పత్రాలు, మెమెంటోలు అందజేశారు. చిన్నారిని తీర్చిదిద్దిన కోచ్ లావణ్య, చిన్నారి తల్లిదండ్రులు ఎం.శ్రీనివాస్, శిరీషను పలువురు అభినందించారు.

కువైట్ బాధితుల కోసం ఆమ్నెస్టీ స్కీం

పెనుగొండ : పాస్‌పోర్టులు, ఇతర నివాస ధ్రువీకరణ పత్రాలు లేకుండా కువైట్‌లో ఉంటున్న ఇతర దేశస్తులకు కువైట్ ప్రభుత్వం అమ్నెస్టీ స్కీం ప్రకటించిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంఘ రాష్ట్ర నాయకుడు కే సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. కువైట్‌లో చాలా మంది భారతీయులు ఏజెంట్ల చేతిలో మోసపోయి రహస్యంగా జీవిస్తున్నారని, ఇలాంటి వారికి ఈ స్కీం వరంగా ఉంటుందన్నారు. ఏ విధమైన ధ్రువీకరణ పత్రాలు లేని వారు కువైట్‌లోని ఇండియన్ ఎంబసీకి వెళ్లి వివరాలు అందిస్తే, తిరిగి ఇండియా రావడానికి అవసరమైన పత్రాలు అందిస్తారని తెలిపారు, వివరాలకు 0096565501767, 0096565501769 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

యోగా మానవులకు వరం



యోగా దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య విజయకుమార్

నూజివీడు: యోగాను జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా జీవితంలో ఎదురయ్యే అనేక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొవచ్చని ఆర్జీయూకేటీ వీసీ ఆచార్య విజయకుమార్ అన్నారు. నూజివీడు ట్రిపుల్‌ఐటీలోని యోగా హాల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం యోగా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్జీయూకేటీ వీసీ విజయకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ యోగా మనసును, శరీరాన్ని ఒకటి చేస్తుందని, ప్రతిరోజు యోగాతో జ్ఞాపకశక్తితో పాటు మానసిక, శారీరక దృఢత్వం మెరుగుపడుతుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన లయ యోగ ప్రదర్శన మంత్రముగ్ధుల్ని చేసింది. కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య ఎం.చంద్రశేఖర్, ఏఓ టి.చంద్రశేఖర్, సెంట్రల్ డీన్ దువ్వూరు శ్రావణి, యోగా ఇన్‌స్ట్రక్టర్ అక్కినేని సత్య శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

లారీ ఢీకొని పీజీ విద్యార్థిని మృతి



గీతావాణి(ఫైల్)



ప్రమాదస్థలంలో గీతావాణి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

పెనుమంట్ర: పెనుగొండ రోడ్డులోని నెగ్గిపూడి లాకుల సమీపంలో శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవగానుగుల గీతావాణి(23) మృతిచెందింది. మార్టేరు శివరావుపేటకు చెందిన గీతావాణి పరీక్షలు రాసేందుకు స్కూటర్‌పై పెనుగొండ వెళ్తుండగా లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. గీతావాణికి వేలివెన్నుకు చెందిన వెంకటేశ్వరరావుతో రెండేళ్ల క్రితం వివాహమైంది. ఎంబీఏ చదువుతున్న గీతావాణి పరీక్షలు రాసేందుకు వారం రోజుల క్రితం పుట్టింటికి వచ్చి పెనుగొండ ఎస్వీకేపీ కళాశాలలో పరీక్షలు రాస్తోంది. భర్త వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ రజనీ కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు పెనుమంట్ర ఇన్‌చార్జి ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ఆకివీడు: విద్యుత్ వైర్లు తెగి పడి ఒక వ్యక్తి మృతిచెందాడు. జాతీయ రహదారి పక్కనే కృష్ణ హాస్పిటల్ వద్ద బత్తాయి జ్యూస్ అమ్ముకునే అల్లాడి నరసింహ శుక్రవారం రాత్రి 9:30 సమయంలో దుకాణం బంద్ చేసి తిరిగి వెళుతుండగా ఒక్కసారిగా ఎల్‌టీ విద్యుత్ వైర్ తెగిపడింది. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆస్పత్రి సమీపంలో శుక్రవారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ మార్చినట్లు సమాచారం. విద్యుత్ వైరు జాయింట్ శుక్రవారం రాత్రి గాలికి ఒక్కసారిగా తెగిపడినట్లు భావిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



తమకు న్యాయం చేయాలని ప్రమాద స్థలంలో రోదిస్తున్న మృతుడి కుటుంబసభ్యులు

నరసాపురం : పట్టణంలోని జెట్టి నాగేశ్వర రావు పెట్రోల్ బంక్ సమీపంలో 216 జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మొగల్తూరుకు చెందిన గోడ రాజ్‌కుమార్(36) మృతి చెందాడు. టౌన్ సీఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటుకల తయారీ పని చేసే రాజ్‌కుమార్ స్నేహితుడు వినోద్‌తో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. వెనుకగా వస్తున్న భీమవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీట్టడంతో రాజ్‌కుమార్ బస్సు వెనుక చక్రాల కింద పడి మృతి చెందాడు. వినోద్ ఎలాంటి గాయాలు కాకుండా బయటపడ్డాడు. ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆరోపిస్తూ మృతుడి భార్య సంఘటనా స్థలంలో ఆందోళన నిర్వహించింది.

గొల్లవానితిప్ప వంతెన వద్ద వ్యాన్ బోల్తా



భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్పలో యనమదుర్రు డ్రెయిన్ వద్ద వంతెన వద్ద చెరుకు లోడుతో వెళ్తున్న డీసీఎం వ్యాన్ శుక్రవారం బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్ క్యాబిన్ లోంచి తప్పించుకున్నారు. స్వల్పగాయాలతో బయటపడ్డారు. గొల్లవానితిప్ప నుంచి రామాయణపురం వైపు వెళ్లాలంటే భీమవరం మీదుగా సుమారు 14 కిలోమీటర్లు రావాలి. అదే గొల్లవానితిప్ప వద్ద వంతెన దాటితే గమ్యస్థానానికి తొందరగా చేరుకోవచ్చని వంతెన దాటుతుంటాయి. అప్రోచ్‌లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరిగి పలువురు తీవ్రంగా గాయపడ్డారు. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఈ ప్రాంతంలో ఉన్న సమస్యలు దృష్టిలో పెట్టుకుని అప్రోచ్‌లు నిమిత్తం రూ. 36 కోట్లు మంజూరు చేయించారు. అప్రోచ్‌లు నిర్మిస్తే పురాతన దేవాలయాలు ధ్వంసం అవుతాయని ఈ ప్రాంత ప్రజలు చెప్పడంతో డిజైన్ మార్చి టెండర్ దశకు తీసుకువచ్చారు. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చింది. దీంతో ఈ ప్రాంత సమస్య మళ్లీ మొదటికొచ్చింది.

జీవన ఎరువులతో నాణ్యమైన దిగుబడి

పాడి-పంట

నూజివీడు: పంటల అధిక దిగుబడుల కోసం రైతులు రసాయన ఎరువులు ఎక్కువగా వాడుతున్నారు. రసాయన ఎరువుల ధరలు ఏటేటా పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడులు పెరుగుతున్నాయి. విచ్చలవిడిగా రసాయన మందులు వాడటం వల్ల కూడా దుష్ఫలితాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పెట్టుబడులు తగ్గాలన్నా, దుష్ఫలితాలు లేకుండా ఉండాలన్నా జీవన ఎరువులు వాడటం మంచిదని నూజివీడు ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్తిపాటి విజయలక్ష్మీ సూచనలు చేస్తున్నారు.

ప్రస్తుత తరుణంలో తక్కువ పెట్టుబడితో అధిక పోషకాలున్న జీవన ఎరువులను ఉపయోగిస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయి. జీవన ఎరువులలో పంటలకు కావాల్సిన పోషకాలైన నత్రజని, భాస్వరం అందించేందుకు అవసరమైన సూక్ష్మజీవులు అధిక సంఖ్యలో ఉంటాయి. వాతావరణంలో వందకు 40 శాతం నత్రజని గాలిలో ఉంటుంది. గాలిలో ఉన్న నత్రజనిని మొక్కలు నేరుగా తీసుకోలేవు. కొన్ని సూక్ష్మజీవులు మాత్రమే వాయు రూపంలో ఉన్న నత్రజనిని తీసుకుని మొక్కలకు అందిస్తాయి. దీనినే నత్రజని స్థిరీకరణ అంటారు.

నత్రజని స్థిరీకరణకు ఉపయోగపడే జీవన ఎరువులు

రైజోబియం : లెగ్యూం జాతి పంటలైన కంది, పెసర, మినుము, శనగ, వేరుశనగ, సోయాచిక్కుడు మొక్కల వేర్లలోని బుడిపెల్లో ఈ బ్యాక్టీరియా స్థిరనివాసం ఏర్పరుచుకుని పంటల కాలంలో నత్రజని స్థిరీకరణ చేస్తాయి.

అజోస్పైరెల్లం : మొక్క వేర్లకు దగ్గరగా నివసిస్తూ వాతావరణంలోని నత్రజనిని గ్రహించి దానిని అమ్మోనియంగా అందిస్తాయి. వరి, చెరకు, రాగి, జొన్న, కూరగాయలు, పశుగ్రాస పంటలు, పత్తి, ఉద్యాన పంటలకు ఇలాగే నత్రజని అందుతుంది.



పీఎస్‌బీ జీవన ఎరువు

అజటోబాక్టర్ : మొక్క వేర్లకు దగ్గరగా ఉండి వాతావరణంలోని నత్రజనిని గ్రహించి దానిని అమ్మోనియంగా మొక్కలకు అందిస్తాయి. గోధుమ, బార్లీ, మెట్ట వరి, మొక్కజొన్న, పొగాకు, టీ, కాఫీ, పళ్లు, పూల మొక్కలకు ఇలాగే నత్రజని అందుతుంది.

భాస్వరం కరిగించే బ్యాక్టీరియా(పీఎస్‌బీ) : మొక్కలకు లభ్యం కాని భాస్వరం నేలలో 60 శాతం వరకు ఉంటుంది. దీనిని మొక్కల వేర్లు నేల నుంచి గ్రహించలేవు. నేలలో పీఎస్‌బీ వేసినప్పుడు ఈ సూక్ష్మజీవులు నేలలో ఉన్న భాస్వరాన్ని విడదీసి మొక్కల వేర్లకు అందిస్తాయి. అన్ని పంటలకు ఇది ఉపయోగపడుతుంది.

జీవన ఎరువులు ఉపయోగించే విధానం

విత్తనశుద్ధి : దీనికి వంద గ్రాముల బెల్లం లేదా పంచదారను లీటరు నీటిలో వేసి 15 నిమిషాలు మరగించి పూర్తిగా చల్లారిన తరువాత 500 గ్రాముల కల్చర్ పొడిని వేసి బాగా కలిపి ఒక ఎకరానికి సరిపడే విత్తనాలకు సమానంగా అంటుకునేటట్లు కలుపుకోవాలి.

నారుశుద్ధి : ఒక కిలో కల్చర్ పొడిని లీటరు నీటిలో కలిపి ద్రావకం తయారుచేసి వేర్లను ముంచి అరగంట తరువాత నేలలో నాటాలి. అలాగే 2 నుంచి 3 కిలోల కల్చరు పొడిని 100 కిలోల బాగా మాగిన పశువుల ఎరువులో కలిపి ఆఖరి దుక్కిలో తేమ ఉన్నప్పుడు వేయాలి.

వాడకంలో జాగ్రత్తలు:

- రైజోబియం వాడేటప్పుడు దుక్కిలో ఎక్కువ మోతాదు నత్రజని వాడకూడదు. నత్రజని ఎక్కువైతే వేర్లకు బుడిపెలు రావు.
- జీవన ఎరువులను నేలలో వేసేటప్పుడు బెట్టకు గురికాకుండా తేమ ఉండేటట్లు చూసుకోవాలి.
- జీవన ఎరువుల ప్యాకెట్లను చల్లని తేమ లేని ప్రదేశంలో వేడి, సూర్యరశ్మి తగలకుండా భద్రపరచాలి.
- సూచించిన పంటలకు గడువుతేదీ లోపులోనే వాడాలి. కల్చర్ పొడి విషపదార్థం కాదు అయితే చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.

లాభాలు

- జీవన ఎరువులు తక్కువ ఖర్చుతో మొక్కకు సమర్థంగా పోషకాలు అందిస్తాయి.
- ఇవి వాయుకాలుష్యం, భూ కాలుష్యాన్ని తగ్గిస్తాయి. తద్వారా భూసారాన్ని పెంచుతాయి.
- రైతులకు పెట్టుబడులు తగ్గడమే కాకుండా దిగుబడులు పెరుగుతాయి.

క్లుప్తంగా

చింతామణిదేవి అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో చింతామణి అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): జేష్ఠ పౌర్ణమి పురస్కరించుకుని స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యాన మందిరంలో చింతామణి అమ్మవారికి ఆలయ అర్చకులు ఆదూరి సాయి కిరణ్ బ్రహ్మత్వంలో పంచామృత అభిషేకాలు, సహస్రనామ అర్చనలు జరిగాయి. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకులు మిత్ర

తాడేపల్లిగూడెం (టీఓసీ): మత్తు పదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకుడు మల్లిపూడి మిత్ర అన్నారు. దీక్ష మత్తు మందుల పునరావాస కేంద్రంలో సొసైటీ సభ్యులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మిత్ర మాట్లాడుతూ యోగా వల్ల ఏకాగ్రత, మానసిక ఒత్తిడి జయించవచ్చునని తెలిపారు. సైకాలజిస్ట్ గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ యోగాలోని లాఫింగ్ థెరపి అనేది మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. లాఫింగ్ వల్లను డొపమైన్, ఆక్సిటోసిన్, సెరటోనిన్ ఎండార్ఫిన్‌లు విడుదల అవుతాయని, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని, ప్రతి రోజు యోగాతో పాటు లాఫింగ్ యోగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మీ అమ్మవారి జాతర



వేల్పూరులో మహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తణుకు టౌన్: మండలంలోని వేల్పూరు గ్రామంలో శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో పీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యులు జాతర మహోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. శుక్రవారం అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేల్పూరు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైల్వే స్టేషన్‌లో స్నేహహస్తం



గూడెం రైల్వే స్టేషన్‌లో స్నేహహస్తం కార్యక్రమం

తాడేపల్లిగూడెం: దక్షిణమధ్యరైల్వే విజయవాడ డివిజన్ పర్సనల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక రైల్వే స్టేషన్ వద్ద రైల్వే ఉద్యోగులు, పెన్షనర్స్ సమస్యల పరిష్కారం కోసం స్నేహహస్తం అవుట్‌రీచ్ కార్యక్రమం జరిగింది. డివిజన్ పరిధిలో వివిధ స్టేషన్లల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్స్ పేమెంటు, ఇంక్రిమెంటు, ఎంఏసీపి, హెచ్ఆర్ఎంఎస్, యుఎంఐడీ, సర్వీసు ప్రమోషన్ తదితర విషయాల గురించి పర్సనల్ ఆఫీసర్ ఆనంద్ కట్ట మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎం.అనిరుధ్, స్టేషన్ మేనేజర్ వై.నాగరాజు, కమర్షియల్ సూపర్‌వైజర్ బి.భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలను హింసించడం నేరం

అత్తిలి: మూగజీవాలను హింసించడం నేరమని, వాటిపై దయతో ఉండాలని ప్రాంతీయ పశువైద్యశాల వైద్యాధికారి కె నరసింహారావు పిలుపునిచ్చారు. శుక్రవారం జంతువుల హక్కులు, వాటి సంరక్షణ, సంక్షేమంపై అత్తిలి డిగ్రీ కళాశాలలోఅవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల్ని హింసిస్తే 1960 జంతు సంరక్షణ చట్టం ద్వారా శిక్ష వేస్తారని హెచ్చరించారు. పశువులకు సరైన వసతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జనరిక్ మందులకే మొగ్గు

- బ్రాండెడ్, జనరిక్ మందుల మధ్య భారీ వ్యత్యాసం..
- జనరిక్ మందుల్లో 40 నుంచి 70 శాతం వరకు డిస్కౌంట్

తణుకు అర్బన్: రోగం చిన్నదైనా పెద్దదైనా మందుల వాడకం అయితే తప్పనిసరిగా కనిపిస్తోంది. వైద్యుల వద్దకు వెళ్లి కొందరు, మందుల దుకాణాలకు వెళ్లి మరి కొందరు రోగం నుంచి ఉపశమనం పొందడానికి మందుల వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేటి రోజుల్లో అవసరం ఉండి కొందరు వైద్యులు, అవసరం లేకపోయినా కొందరు వైద్యులు చాంతాడంత మందుల లిస్టు రాయడం పరిపాటిగా మారింది. దుకాణాల్లో మందుల ధరలు చూస్తూ ఆ మందులు కొనుగోలు చేయలేక రోగులు అల్లాడుతున్న పరిస్థితి ఉండగా, మార్కెట్‌లో అతి తక్కువ ధరలకు మందులు లభ్యమవుతున్న జనరిక్ మందుల కొనుగోలు చేసేందుకు అధికశాతం రోగులు మొగ్గు చూపిస్తున్నారు. ప్రముఖ ఫార్మా కంపెనీలకు సంబంధించిన మందులు కూడా ఈ జనరిక్ మందుల దుకాణాల్లో 40 నుంచి 70 శాతం వరకు తక్కువ ధరలకు విక్రయాలు చేస్తుండడంతో పేద, మధ్యతరగతి వర్గాలే కాకుండా ఆర్థికంగా బలంగా ఉన్న వారు సైతం జెనరిక్ మందుల కొనుగోలుకు ముందుకు వస్తున్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని ప్రభుత్వం నడుపుతున్న సంజీవని జనరిక్ మందుల దుకాణంలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండడంతో రోగుల ఆదరణ అధికమైంది. ఆస్పత్రిలో అందుబాటులో లేని మందులను వైద్యులు జనరిక్ మందుల దుకాణానికి సిఫార్సు చేస్తుంటారు.



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సంజీవని జనరిక్ మందుల దుకాణం



అందుబాటులో ఉన్న మందులు

తణుకు నియోజకవర్గంలో 500లకు పైగా దుకాణాలు

తణుకు నియోజకవర్గంలోని తణుకు మునిసిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 500లకుపైగా మందుల దుకాణాలు ఉండగా కోట్లాది రూపాయిల వ్యాపారం జరుగుతోంది. వీటిలో సుమారుగా 50 వరకు జనరిక్ మందుల దుకాణాలు అందుబాటులో ఉన్నట్లుగా తెలుస్తోంది. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే రోగులు ఆస్పత్రిలో అందుబాటులోఉన్న మందుల దుకాణాల్లోనే అధిక శాతం మందులు కొనుగోలు చేస్తుండగా మార్కెట్లో ఉన్న దుకాణాల్లో సైతం ఇటీవల వ్యాపారం తగ్గింది. మందుల దుకాణాలు పెరగడంతోపాటు జెనరిక్ దుకాణాలు సైతం కొత్తగా పుట్టుకొస్తుండడం, జనరిక్ మందుల వాడకంలో అవగాహన కొద్దిగా పెరగడం కూడా కారణంగా కనిపిస్తోంది.

ఏదైనా మందు ఒక్కటే

తణుకు అర్బన్: జనరిక్ మందులు, బ్రాండెడ్ మందులు పేరు మాత్రమే వేరని తయారుచేసే విధానంతోపాటు రామెటీరియల్, ఫార్ములా అంతా ఒకే విధంగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. కొన్ని బ్రాండెడ్ కంపెనీలు తమ పేటెంట్ హక్కుల కోసం మాత్రమే బ్రాండెడ్ విధానంలో ధరలు అధికంగా విక్రయాలు చేస్తుంటారని అధికారులు, అయితే పేటెంట్ హక్కుల సమయం పూర్తయిన తరువాత అన్ని ఫార్మా కంపెనీలు సదరు మందులను తయారు చేసుకునే వెసులుబాటు ఉంది. దీంతో జనరిక్ మందుల్లో కూడా సిప్లా, రాన్‌బ్యాక్సీ, ఇంటాస్, వోకాడ్, ఆల్కెమ్, డాక్టర్ మార్టిన్, జిడ్రగ్స్, యబాట్, లిఫోడ్ వంటి ప్రధాన కంపెనీలకు సంబంధించి కూడా జెనరిక్ మందులు అందుబాటులో ఉన్నాయి. సుగర్, బీపీ వంటి దీర్ఘకాలిక రోగాలకే కాకుండా థైరాయిడ్, కిడ్నీ, గర్భిణులు, ఆర్థోపెడిక్, లివర్, కంటి, డెంటల్, గుండె విభాగాలకు సైతం జెనరిక్ మందులు అందుబాటులోకి రావడమే కాకుండా ధరల మధ్య భారీ వ్యత్యాసం ఉండడంతో నేడు జనరిక్ మందుల దుకాణాల్లో వ్యాపారాలు పెరిగాయి.

హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు నిత్యావసరాలు అందజేత



తణుకు సేఫ్‌కేర్ సెంటర్‌లో రోగులకు నిత్యావసరాలు అందజేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు నిత్యావసరాలు అందించిన దాతల ఔదార్యం అభినందనీయమని సేఫ్‌కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని సేఫ్‌కేర్ సెంటర్‌లో హెచ్‌ఐవీ బాధిత చిన్నారులకు స్థానిక ఇషా హాస్పిటల్ యాజమాన్యం అందచేసిన నిత్యావసర సరుకులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ హెచ్‌ఐవీ సోకిన గర్భిణులు వైద్యుల సూచనలను తూచా తప్పకుండా పాటిస్తే పుట్టబోయే బిడ్డలకు హెచ్‌ఐవీ సోకదని స్పష్టం చేశారు. గతంలో కొందరు గర్భిణులు వైద్యుల సూచనలు పాటించకపోవడంతో నేడు కొందరు బాలలు హెచ్‌ఐవీతో జీవించాల్సి వస్తుందన్నారు. ఇషా హాస్పటల్ అధినేత డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ అభం శుభం తెలియని చిన్నారులు కూడా హెచ్‌ఐవీ బారిన పడడం వారి తప్పుకాదని అటువంటి పరిస్థితులు తలెత్తిన సందర్భంలో వారికి మన వంతుగా సహకారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వైద్యులు రామకృష్ణ అడిగిన వెంటనే తాను ప్రతినెలా నిత్యావసర సరుకులు ఇస్తానని చెప్పి గత కొన్ని నెలలుగా ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇషా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కిషోర్‌కుమార్, సేఫ్‌కేర్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య సంజీవని యోగా

తాడేపల్లిగూడెం, తణుకు డివిజన్లలో ఆకట్టుకున్న విన్యాసాలు

తణుకు అర్బన్: నిత్యం యోగ ఆచరించడం వలన మంచి ఆరోగ్యంతోపాటు మానసిక ఉల్లాసంగా ఉండవచ్చని యోగ గురువు బొద్దాని శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ యోగ దినోత్సవం సందర్భంగా తణుకు కోర్టు ప్రాంగణంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆధ్వర్యంలో శుక్రవారం యోగాభ్యాసన చేశారు. ఈ సందర్భంగా యోగ గురువు శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవాళి ఆనందంతో పాటు ఆరోగ్యకరంగా ఉండడానికి యోగ సంపూర్ణంగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం న్యాయమూర్తి డి.సత్యవతి నేతృత్వంలో యోగ గురువును న్యాయమూర్తులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్, సెకండ్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఏవీ నాగరాజు, స్పెషల్ కోర్టు జడ్జి పీఎస్‌పీ చిరంజీవిరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ యోగా చేయడం అలవర్చుకోవాలి

అత్తిలి: యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక మార్పులు వస్తాయని, ప్రతీ ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం చెప్పారు. ప్రపంచ యోగా దినోత్సవం శుక్రవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ పురుషోత్తం, జి శ్రీనివాస్, ఎస్ సుజాతదేవి, శ్రీకాంత్, వెంకటకృష్ణ, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో....

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా మాస్టర్ బండి శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యుడు ప్రసాద్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం

తణుకు టౌన్: యోగాతో మానసిన ఉల్లాసం సాధ్యపడుతుందని తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ చెప్పారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కేఆర్ ఫణిధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఐవీ నారాయణ, ఎన్ విష్ణువర్ధన్, కె వెంకన్న బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో.....

విద్యార్థినీల ఆరోగ్యానికి యోగా దోహదం చేస్తుందని తణుకు ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి చెప్పారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, వివేకానంద గ్లోబల్ స్కూల్ కరస్పాండెంట్ చిట్టూరి రీనా సాయి, ప్రిన్సిపాల్స్ కె రామకృష్ణ, బీహెచ్ హిమబిందు, ఎన్‌సీసీ క్యాడెట్‌లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



తణుకు టౌన్: యోగాసనాలు వేస్తున్న విద్యార్థినిలు



తాడేపల్లిగూడెం : నిట్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం



తణుకు అర్బన్: కోర్టు ప్రాంగణంలో యోగా గురువును సత్కరించిన న్యాయమూర్తులు



అత్తిలి : బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

యోగాతో ఒత్తిడి లేని జీవితం

తాడేపల్లిగూడెం రూరల్: యోగా చేయడం ద్వారా ఒత్తిడి లేని జీవితం సాధ్యమవుతుందని సమగ్ర శిక్ష ఏపీసీ పి.శ్యామ్‌సుందర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సాంఘీక సాంక్షేమ గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతుల అన్నవరం, మండల విద్యాశాఖాధికారులు వి.హనుమ, పీఎం కే.జ్యోతి, ఏఎంవో రామకోటేశ్వరరావు, సీఎంవో చంద్రశేఖర్, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

యోగా ఘనత భారత్‌దే

తాడేపల్లిగూడెం: ప్రపంచానికి యోగాను పరిచయం చేసిన ఘనత భారతదేశానిదే అని ప్రపంచయోగా దినోత్సవం సందర్భంగా పలు సంస్థల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమాల్లో వక్తలు పేర్కొన్నారు. నిట్‌లో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి మాట్లాడుతూ నిత్యయోగా సాధనతో చక్కని ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. పురపాలక సంఘం వద్ద కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో కమిషనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు. ఆదికవి నన్నయ్య క్యాంపస్‌లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.అశోక్ పాల్గొన్నారు. శశి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన యోగాడేలో సంస్థల అధినేత బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ): బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అధ్యక్షతన యోగా డే జరిగింది. పట్టణ 11వ అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ ఛైర్మన్ షేక్ సికిందర్ బాషా, సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణ్ శ్రీ, 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.అరుంధతి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇ.అన్నామణి, సీనియర్ న్యాయవాదులు యోగా ఆసనాలు వేశారు.

7,856 కేసులు పరిష్కరించాం

సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ



విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: కన్జ్యూమర్ గ్రీవెన్స్ రిడ్రెసల్ (సీజీఆర్ఎఫ్) ఏర్పాటైన తర్వాత ఎనిమిది వేల కేసులు రాగా, ఇప్పటి వరకు 7856 కేసులు పరిష్కరించామని, 139 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కమిటి ఛైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణం హౌసింగ్‌బోర్డులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రూరల్ మండల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారుడు తమ సమస్యను 1912 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. వారు స్పందించకపోతే రాతపూర్వకంగా, లేదా ఈ-మెయిల్ ద్వారా ఫోరానికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఓల్టేజ్ లోపాలు, మీటర్ కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్ ఫెయిల్యూర్, పేరు మార్పిడి, అదనపు లోడు, ఇంటి పేరు మార్చడం, బిల్లులు వంటి సమస్యలు తమ పరిధిలోకి వస్తాయన్నారు. ధనం, న్యాయవాదుల ఖర్చు ఉండదని, ఉచిత న్యాయ సహాయం అందజేస్తామన్నారు. వినియోగదారునికి నష్టపరిహారం ఇచ్చే ప్రక్రియ కూడా ఉందన్నారు. పవర్ కట్ వంటి సమస్యలను ఆరు గంటల్లో పరిష్కరించాల్సిన బాధ్యత విద్యుత్ అధికారులపై ఉందన్నారు. లేకుంటే వినియోగదారునికి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. విద్యుత్ ఇంజనీర్ల నుంచి ఈ పరిహారం వినియోగదారునికి చెల్లిస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు వి.జనార్ధనరావు, డాక్టర్ ఆర్.సురేంద్రకుమార్, ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు, ఏడీఈలు బి.రామకృష్ణ, ఎ.సతీష్, ఏఈ ఎ.రామకృష్ణ, సబ్ ఇంజనీర్ జి.హరికృష్ణ, విద్యుత్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న దృశ్యం

అత్తిలి: విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం కోరారు. శుక్రవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్టూడెంట్ కిట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు, దుస్తులు, బ్యాగ్‌లు, షూస్, బెల్టులు, నోట్‌పుస్తకాలను పంపిణీ చేస్తుందని, వీటిని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ, జనసేన నాయకులు గారపాటి ధర్మయ్య, ఆకుల రామచంద్రరావు, గారపాటి బాబ్జి, దాసం ఆదియ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో...

మంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం స్టూడెంట్ కిట్లు ప్రజా ప్రతినిధులు చేతులు మీదుగా విద్యార్థులకు అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ చింతారామయ్య, ఎంపీటీసీ సభ్యురాలు దారం శిరీషా, జెట్పీటీసీ సభ్యురాలు అద్దాల జానకి, టీడీపీ నాయకుడు శీతాల వెంకట శ్రీనివాస్, ఎంఈవోలు ఎస్ రమేష్, ఎం కేశవ ప్రసాద్, స్కూల్ హెచ్ఎం ఎస్‌వీ రమణ, స్కూల్ కాంప్లెక్స్ సెక్రటరీ గుడిమెట్ల సుధాకర్, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు జవ్వాది వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 9, 11, 12, 19, 20, 22 వార్డుల్లో శుక్రవారం కాలానుగుణ వ్యాధులపై అవగాహన, ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాలు జరిగాయి. క్షేత్రస్థాయి పరిశీలనలు చేశారు. ర్యాలీలు నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణ కోసం వైద్య ఉద్యోగులు క్షేత్రస్థాయిలో బాధ్యతయుతంగా వ్యవహరించాలని, ప్రజల్ని వ్యాధుల భారీ నుంచి రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు మేరీ, మంగతాయారు, వెంకట లక్ష్మి, నాగమల్లి, పోసమ్మ, కాంతారావు, ప్రసాద్‌బాబు, ఆశాలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించండి

అత్తిలి: చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపడం ద్వారా వారిలో శారీరక, మానసికాభివృద్ధి జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. తిరుపతిపురం సెక్టార్ బల్లిపాడు గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్బంద విద్యకాకుండా ఆట, పాట, మాట, కథా సంభాషణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని, దీంతో పిల్లలు స్వేచ్ఛగా విద్యను నేర్చుకుంటారని అన్నారు. ప్రతీ నెలా అంగన్‌వాడీ కేంద్రాలకు వైద్యులు హాజరై చిన్నారులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. ఈసందర్భంగా యోగా డేను పురస్కరించుకుని యోగా చేసారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి నర్సవేణి, ఎం శివ సత్యవతి, బి నిర్మలకుమారి, సీహెచ్ రామలలిత తదితరులు పాల్గొన్నారు.



బల్లిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో యోగా చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి

నేడు తెలుగు సాహితీ సమాఖ్య సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక బీవీఆర్ కళాకేంద్రంలో తెలుగు సాహితీ సమాఖ్య స్వర్ణోత్సవాలు సందర్భంగా ఈ నెల 22వ తేదీ శనివారం సాయంత్రం 6 గంటలకు సమాఖ్య 652వ కార్యక్రమం జరుగుతుందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ బ్రహ్మాజీ, పైలు శ్రీనివాసరావులు వెల్లడించారు. డాక్టర్ గజల్ శ్రీనివాస్‌కు గజల్ సామ్రాట్ అవార్డు ప్రధానోత్సవం జరుగుతుందని తెలిపారు. ముఖ్య అతిథిగా శాసన సభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ హాజరవుతారని వెల్లడించారు. పట్టణ ప్రముఖులు, సాహితీ సభ్యులు, కళాకారులు హాజరు కావాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



భవిత సెంటర్‌ను పరిశీలించిన పి.శ్యాంసుందర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని భవిత దివ్యాంగుల సెంటర్‌ను శుక్రవారం సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం అందజేస్తున్న అనేక సంక్షేమాలను తప్పక సద్వినియోగం చేసుకోవాలన్నారు. బడిబయిట పిల్లలు ఉండరాదని, బడిలో చేర్పాలని సూచించారు. సర్వేలో గుర్తించిన దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలో పేర్లు నమోదు చేయించి సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగుల పిల్లలకు కల్పించు సదుపాయాలను అందరికి వెల్లడించాలన్నారు. దివ్యాంగుల ఉన్నతి కోసం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త సీహెచ్ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ రామకోటేశ్వరరావు, ఏఎస్ఓ చంద్రశేఖర్, సీఎంఓ చంద్రశేఖర్, ఎంఈఓలు వి.హనుమ, పీఎంవీకే జ్యోతి, కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.